

బ్రహ్మ రథోత్సవానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి- కదిరి అర్బన్

ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బ్రహ్మ రథోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు పాలకమండలి చైర్మన్ జరిపిటి గోపాలకృష్ణ, ఆలయ ఈవో గురు ప్రసాద్ తెలిపారు. రథోత్సవానికి అవసరమైన తాళ్లు, ఇతర వస్తువులు సిద్ధం చేసి రథోత్సవానికి అవసరమైన కార్యక్రమాలన్నీ చేపడుతున్నామని వారు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం గజవాహనంపై ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి విహరించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో దాదాపు 50 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు అయ్యప్ప సేవా సమితి సభ్యులు ప్రభాకర్, బ్యాంక్ కృష్ణ, రాఘవ తదితరులు తెలిపారు.

నేడే పోలింగు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు పోలింగు సమయం ఆసన్నమైంది. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి పోలింగు ప్రారంభం కానుంది. ఈ ఎన్నికల్లో పట్టభద్రులకు సంబంధించి 49 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఆదివారం నాడే పోలింగు సామాగ్రిని పోలింగు సిబ్బందికి అందజేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలకు పట్టభద్రులకు జంబో బ్యాలెట్ బాక్సులను, ఉపాధ్యాయ నియోజకవర్గానికి పోటీలోనున్న అభ్యర్థులు తక్కువగానే ఉండటంతో సాధారణ బ్యాలెట్ బాక్సులను అందజేశారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 407 మంది సిబ్బందిని అనంతపురం జిల్లాలో నియమించారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 139 మంది పోలింగు సిబ్బంది నియమించారు. వీరితోపాటు ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సుమారు 1200 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. వీరందరూ ఆదివారం సాయంత్రానికే తమకు

సర్వం సిద్ధం

కేటాయించిన పోలింగు కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగు జరగనుంది.

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 330124 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అనంతపురం జిల్లాకు 68341 మంది ఓటర్లు, సత్యసాయి జిల్లాలో 43310, కర్నూలు జిల్లాలో 61633, నంద్యాల జిల్లాలో 54929, వైఎస్ఆర్ కడప జిల్లాలో 81317, అన్నమయ్య జిల్లాలో 20594 మంది ఓటర్లు ఉన్నారు. అదే ఉపాధ్యాయ నియోజకవర్గానికి వస్తే మొత్తం 28148 మంది ఓటర్లు ఉన్నారు. అనంతపురం జిల్లాలో 5564 మంది ఓటర్లు, సత్యసాయి జిల్లాలో 3348, కర్నూలు జిల్లాలో 5391, నంద్యాల జిల్లాలో 4426, వైఎస్ఆర్ కడప జిల్లాలో 7461, అన్నమయ్య జిల్లాలో 1958 మంది ఓటర్లు ఉన్నారు.

పటిష్టమైన భద్రత

మండలి ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో భాగంగా ఎక్కడా ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా సజావుగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అనంతపురం ఎస్పి డాక్టర్ కె.పక్కీరప్ప తెలిపారు. ఈ ఎన్నికల్లో 1200 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 117 పోలింగు కేంద్రాలు ఉన్నాయి. ఇద్దరు అదనపు ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 22 మంది సిఐలు, 49 మంది ఎస్ఐలు, 217 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 765 మంది కానిస్టేబుళ్లు, 117 మంది హోంగార్డులు, మూడు ఎపిఎస్పి బెటాలియన్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పోలింగు కేంద్రాల వద్ద వంద మీటర్ల వరకు గుంపులు, సమూహాలు ఉండేందుకు వీల్లేదని తెలిపారు.



అధికారులకు అందజేస్తున్న పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్



డబ్బు పంపిణీపై అధికారులు, వైసిపి నాయకులతో నేరుగా సమీక్ష చేస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్

ఓటుకు రూ.వెయ్యి

వాలంటీర్లు చూపించారు..మరొకరు పంచారు..

డబ్బుల పంపిణీపై అధికారులు, నాయకులతో నేరుగా మంత్రి సమీక్ష

ఉపాధ్యాయ నియోజకవర్గానికి రూ.5 వేలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో పక్కాగా డబ్బులు పంపిణీని అధికార పార్టీ చేపట్టింది. ఎన్నికల ప్రచారం ముగియగానే శనివారం నాటి నుంచే డబ్బుల పంపిణీని మొదలు పెట్టింది. పట్టభద్రులకు సంబంధించి ఓటుకు వెయ్యి రూపాయలు చొప్పున ప్రతి ఓటరుకూ చేరవేసే ప్రయత్నం చేసింది. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గానికి చూస్తే ఓటుకు రూ.5 వేలు నుంచి రూ.9 వేలు వరకు కూడా పంపిణీ సాగింది. ఇందుకు వాలంటీర్లనే వినియోగించుకుంది. నేరుగా వాలంటీర్ల ద్వారా కాకుండా వారు ఓటరు ఇళ్లు చూపిస్తే... మరొకరు వచ్చి కరపత్రం, వెయ్యి రూపాయల డబ్బులు ఓటర్లకు పంచిపెట్టారు. ఈ డబ్బు పంపిణీ వ్యవహారం తన సొంత నియోజకవర్గమైన కళ్యాణదుర్గంలో ఏ రకంగా జరిగిందన్న సమీక్షను స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్ వైసిపి నాయకులతో సమీక్ష చేసిన ఒక వీడియో సైతం వైరల్ అయింది. ఒక గ్రామంలో 20 ఓట్లు ఉన్నాయి. రూ.20 వేలు పంపిణీ జరిగిందా లేదా... ఎవరు పంపిణీ చేసారన్న వివరాలు ఇవ్వాలని చెబుతున్న వీడియో బయటకు వచ్చింది. ఇందులో ఈ నియోజకవర్గ నాయకులు, కొందరు వాలంటీర్లు ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే రకంగా ఇతర నియోజకవర్గాల్లోనూ యథేచ్ఛగా డబ్బు పంపిణీ కొనసాగింది. కళ్యాణదుర్గంలో మంత్రి వీడియో బయటకు వచ్చాక టిడిపి కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అక్కడి ఎన్నికల అధికారి నిషాంత్ అందుబాటు లేకపోవడంతో ఎఒకి వినతిపత్రం అందజేశారు. మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ఈ రకంగా ప్రలోభాలకు తెరలేపడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి ఉష శ్రీచరణ్‌పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను డబ్బుతో కొనేందుకు మంత్రి ఉష శ్రీచరణ్ చేసిన ఏర్పాట్ల వీడియోపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆమెను కట్టడి చేయాలని ఎన్నికల అధికారులను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కోరారు. బాధ్యత కలిగిన స్థానంలో ఉన్న మంత్రి ఇంత నిస్సిగ్గుగా డబ్బులు పంపిణీకి దిగజారడం దారుణమన్నారు. నేడు జిల్లాలో ఎమ్మెల్యేలు, మున్సిపల్ ఛైర్మన్‌లు, కొందరు కౌన్సిలర్లు యథేచ్ఛగా డబ్బులు పంపిణీ చేశారని అన్నారు. డబ్బులు తీసుకోవడానికి నిరాకరించిన ఓటర్లను భయపెడుతున్నారని తెలిపారు. ఈ చర్యలు వైసిపి బలహీనతకు నిదర్శనం అని విమర్శించారు. ఉన్నత విద్యావంతులైన పట్టభద్రుల ఓట్లను రూ.వెయ్యి చొప్పున లెక్కపెట్టి మంత్రి కొంటున్న వీడియోపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ దిగజారుడు రాజకీయాలకు నేడు జరిగే ఓటు ద్వారా పట్టభద్రులు, ఉపాధ్యాయులు బుద్ధి చెప్పాలన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి లను గెలిపించాలని ఆయన కోరారు.

పంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర సర్పంచులదే



శ్రీ సత్యసాయి జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్



ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులదే కీలకపాత్రని, గ్రామంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవడమే తమ విధి అని శ్రీ సత్యసాయి జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్ పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు తదితర సమస్యలను ఎప్పటికప్పుడు సర్పంచులు పర్యవేక్షించి పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తున్నారని తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర అంశాలను వెలిబుచ్చారు.

ప్రశ్న : గ్రామాల్లో దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

డిపిఒ : సత్యసాయి జిల్లా పరిధిలోని పంచాయతీలలో దోమల నివారణ కోసం కొన్నిచోట్ల ఫాగింగ్ యంత్రాలను అందజేశాం. మేజర్ పంచాయతీల్లో ఆటోల్లో వేసుకుని ఫాగింగ్ చేస్తున్నారు. మైనర్ పంచాయతీల్లో పంచాయతీ కార్మికులే వీధుల గుండా ఫాగింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాం. పది రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపునీరు ఎక్కడ చూసినా నిల్వవుంది. దీంతో దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగింది. దోమల నివారణకు చెత్తాచెదారం, నీటి నిల్వలు ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ఆదేశించాం. ఇంటి పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకునే విధంగా చర్యలు చేపట్టాం. కార్మికుల ద్వారా శుభ్రం చేయిస్తున్నాం. దీంతో దోమల వ్యాప్తి కొంతమేర తగ్గింది.

ప్రశ్న : చెత్తతో సంపద సృష్టి కేంద్రాల వల్ల ప్రయోజనాలు ఉన్నాయంటారా ?

డిపిఒ : శ్రీ సత్యసాయి జిల్లాలో 404 చెత్తతో సంపద సృష్టి కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 257 కేంద్రాల్లో వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారవుతున్నాయి. వాటి అమ్మకం ద్వారా పంచాయతీలకు కొంతమేర ఆదాయం లభిస్తుంది. దాంతోపాటు పొడి చెత్త, తడి చెత్త వేరువేరుగా చేసి, ప్లాస్టిక్‌ను సపరేట్ చేసి వాటిని సైతం అమ్మడం వల్ల కొంత రాబడి లభిస్తుంది. ఈ వర్మీ కంపోస్ట్ చాలామంది రైతులకు లాభదాయకంగా ఉంది. వర్మీకంపోస్టును రైతులు కొనుగోలు చేసి జామ, అరటి తోటలకు వేస్తున్నారు. దీని వల్ల పంచాయతీకి ఆదాయం లభిస్తుంది.

ప్రశ్న : పంచాయతీలలో నిధులు లేని కారణంగా అభివృద్ధి ఆగింది. దీనిపై మీ అభిప్రాయం ?

డిపిఒ : నిధులు లేని కారణంగా అభివృద్ధి ఆగింది అని చెప్పడం సరికాదు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొదటి, రెండవ విడత నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడం ద్వారా పంచాయతీల్లో పలుచోట్ల అభివృద్ధి పనులు ఆగాయి. వేరే నిధుల ద్వారా ఆ పనులు చేపట్టాం. అదే పంచాయతీలో పన్నుల బకాయిలను వసూలు చేసి అభివృద్ధికి ఉపయోగించాలని ఆదేశించాం. నీటి, ఇంటి పన్నులు, రిజిస్ట్రేషన్ సర్‌ఛార్జీలు తదితర వాటి ద్వారా నిధులు సమకూర్చుకొని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సూచించింది. త్వరలో మూడో విడత నిధులు మంజూరు అవుతాయి. దాని ద్వారా పంచాయతీలు అభివృద్ధి చెందుతాయి. మన జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13369 గ్రామ పంచాయతీల్లో కూడా నిధులు లేకున్నా అభివృద్ధి ఆగలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరపున త్వరలో నిధులు మంజూరు చేసి అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూస్తాం.

ప్రశ్న : ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయితీలకు నిధులు మంజూరు చేశారా?

డిపిఒ : ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ఇదివరకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. వాటికి కేంద్ర ప్రభుత్వం ద్వారా జనాభా ప్రాతిపదికన అభివృద్ధికి నిధులు విడుదల చేస్తారు. ఇప్పటివరకు మన జిల్లాలో ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు నిధులు అందలేదు. కేంద్ర ప్రభుత్వం మూడు పద్ధతులు ద్వారా వాటికి నిధులను అందజేస్తుంది.

ప్రశ్న : వీధిలైట్లు, సంపద సృష్టి కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. దానిపై మీ అభిప్రాయం ?

డిపిఒ : కొన్ని మేజర్ పంచాయతీల్లో వీధిలైట్లు ఏర్పాటు చేశాం. అవి రాత్రి పగలు వెలుగుతున్నాయి. వాటికోసం విద్యుత్ శాఖ అధికారులు థర్డ్ లైన్ సపరేటుగా ఏర్పాటు చేస్తే.. అవి పగటిపూట వెలగకుండా స్విచ్‌లు ఏర్పాటు చేశాం. కొన్ని గ్రామాల్లో వీధిలైట్లు ఉన్నా సపరేట్ లైన్ లేకపోవడంతో అవి వెలగడం లేదు. దాంతోపాటు సంపద సృష్టి కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం త్వరలో కల్పిస్తాం. అందులో ఉన్న యంత్రాలకు విద్యుత్ సౌకర్యం అవసరం. జిల్లాలో ఉన్న అన్ని సంపద సృష్టి కేంద్రాలకు త్వరలో విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం.



కిడ్నాపర్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు. ఇన్‌సెట్‌లో కిడ్నాప్‌కు గురైన హనుమంతరాయుడు, కళావతి

భార్యాభర్తల కిడ్నాప్ విఫలం

సమయస్ఫూర్తితో ఘటనను ఛేదించిన ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసులు

అభినందించిన ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

భార్యాభర్తల కిడ్నాప్ ఘటనను అనంతపురం ఉమ్మడి జిల్లాల పోలీసులు సమయస్ఫూర్తితో ఛేదించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామానికి చెందిన హనుమంతరాయుడు, కళావతిలను కొందరు రెండు కార్లలో వచ్చి కిడ్నాప్ చేసి తీసికెళ్లారని ఆదివారం మధ్యాహ్నం 12:45 గంటలకు డయల్-100 కు సమాచారం అందింది. ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప దష్టికి రావడంతో వెంటనే హై అలెర్ట్ యాప్ ద్వారా అనంతపురం జిల్లా పోలీసులను, శ్రీసత్యసాయి జిల్లాలోని సరిహద్దు పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే పోలీసు అధికారులు రహదారులపైకి వచ్చి వాహనాల తనిఖీలు కొనసాగించారు. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా ముదిగుబ్బ పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ఐ హేమంత్ కుమార్, ఆయన సిబ్బంది కిడ్నాపర్లను పట్టుకుని అదుపులో తీసుకున్నారు. రెండు కార్లు సీజ్ చేసి కిడ్నాప్‌నకు గురైన భార్యాభర్తలకు చెర విముక్తి కల్పించారు. కిడ్నాప్‌నకు గల కారణాల కోసం పోలీసులు విచారిస్తున్నారు. ఈ ఘటన ఛేదింపులో కృషి చేసిన ఇరు జిల్లాల పోలీసులను, డయల్ 100, టెక్నికల్ విభాగం సిబ్బందిని ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి అభినందించారు.

కొనసాగిన డబ్బుల పంపిణీ..!

ప్రజాశక్తి-హిందూపురం

సోమవారం జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రులు శాసన మండలి ఎన్నికలు డబ్బు మయంగా మారాయి. విద్యావంతులు, ఉపాధ్యాయులను సైతం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రలోభ పెట్టారు. డబ్బు పంపిణీలో అధికార పార్టీ ముందు వరసలో నిలిచింది. ఉపాధ్యాయ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థి తరుపున ఓటుకు రూ.5 వేలు చొప్పున శనివారమే పంపిణీ పూర్తి చేశారు. అయితే పట్టభద్రుల స్థానానికి సంబంధించి డబ్బు పంపిణీ తమ చేతుల మీదుగా జరగాలంటూ శనివారం వాదులాడుకున్న నాయకులు ఆదివారం అర్ధరాత్రి ఒక్కటైనట్లు సమాచారం. శనివారం అర్ధరాత్రి వరకు పార్టీ అభ్యర్థి ఇక్కడే మకాం వేసి చర్చలు జరిపారని మంత్రితో మాట్లాడారని తెలిసింది. అధిష్ఠానం ఇచ్చిన సూచనలను అందరూ పాటించాలని ఆదేశాలు రావటంతో ఓటర్లను చూపే బాధ్యత స్థానిక నాయకులకు, డబ్బు ఇచ్చే పని మరో మండలంల నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలకు అప్పగించినట్లు సమాచారం. దీంతో వార్డుల్లో పంపిణీ యథేచ్ఛగా జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఓటుకు రూ. వెయ్యి వంతున ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ప్రతిపక్ష టిడిపిలో మాత్రం ముసలం పుట్టింది. ఓటుకు రూ.500 ఇస్తారని ముందుగా ప్రచారం జరిగినా, పంపిణీ చేయలేయకపోయినట్లు తెలుస్తోంది. ఓటర్లకు బదులుగా దరఖాస్తుల నమోదు నుంచి చివరి రోజు దాక అలుపెరగక శ్రమిస్తున్న కింది స్థాయి నాయకులకు, కార్యకర్తలకు డబ్బు పంపిణీకి ప్రయత్నాలు జరిగాయి. అయితే అది తక్కువ మొత్తం కావడం, ప్రతి వార్డులోను నాయకులు ఎక్కువగా ఉండటంతో తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు చోటు చేసుకున్నట్లు సమాచారం. దీంతో నాయకుల అలకకు, ఆసంతప్తికి దారి తీసింది. వాటిని సర్దుబాటు చేయడం ముఖ్య నాయకులకు తలకు మించిన భారంగా మారింది. ఉపాధ్యాయ స్థానం నుంచి బరిలో ఉన్న ఓ అభ్యర్థి నగదు పంపినా, ఇక్కడ ఆయన వర్గీయులుగా వ్యవహరిస్తున్న వారు అందజేయలేదనే ప్రచారం ఈ ప్రాంతంలో జోరుగా సాగుతోంది. అదే అభ్యర్థి కర్నూలు జిల్లాలో ఓటుకు రూ.2 నుంచి 3 వేలు ఇచ్చారని, ఈ జిల్లాలో రూ.2 వేలు వంతున ఇస్తారని ఓటర్లు ఆశించినట్లు తెలుస్తోంది. ఏ ఇద్దరు ఓటర్లు మాట్లాడుకొన్నా, డబ్బు పంపిణీ గురించే కావడం గమనార్హం. డబ్బు పంచకపోవడం ఎన్నికల్లో తమ విజయావకాశాలను దెబ్బ తీస్తుందని పలు పార్టీల అభ్యర్థుల మద్దతుదారులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో ఓటర్లకు అందజేత

నాయకులకే తక్కువ వచ్చిందంటూ టిడిపిలో అంతర్గత విభేధాలు

సజావుగా ఎన్నికల నిర్వహణకు చర్యలు : కలెక్టర్



ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం పుట్టపర్తి లోని చిన్నపల్లి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల పోలింగ్ సరళిని నిఘా నీడలో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. వీడియో చిత్రీకరణ, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. జిల్లాలో 86 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, పట్టభద్రులకు సంబంధించి 43,310 మంది ఓటర్లు ఉన్నారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 3348 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్ పి రాహుల్ దేవ్ సింగ్, జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ ఎన్నికల సామాగ్రి తరలింపు ప్రక్రియను పరిశీలించారు. ఎస్పి మాట్లాడుతూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. డిఆర్ఒకొండయ్య పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ విధానం గురించి డెమో ద్వారా ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పి రామకృష్ణ ప్రసాద్, డిఎస్పి యశ్వంత్, ఆర్డిఒ భాగ్యరేఖ, సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం : సోమవారం జరగనున్న పట్టభద్రుల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. జిల్లాలో 11 రూట్లను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల ఎన్నికల కోసం 54 పోలింగ్ కేంద్రాలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 13 సాధారణ, 11 సమస్యాత్మక, 8 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలలో 20 సాధారణ, 18 సమస్యాత్మక, 16 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ ఎన్నికలకు 46 మంది ప్రిసైడింగ్ అధికారులను, 47 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను నియమించామన్నారు. పట్టభద్రుల ఎన్నికలకు 60 మంది ప్రిసైడింగ్ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. 108 మంది పరిశీలకులను నియమించామని, ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ క్యాస్టింగ్ ఫోటోగ్రఫీ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల అధికారులకు ఎన్నికల సామాగ్రిని అందజేశామని, ఎన్నికల కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు.

జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి పేరుతో మోసం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి పేరుతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులను నిలువున మోసం చేశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. అదే విధంగా ఉద్యోగులకు ఐఆర్, ఇంక్రిమెంట్ ఇవ్వడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి కనీసం 1వ తేదీన వేతనాలు సైతం ఇవ్వడం లేదని అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐఎంఎ హాల్‌లో వామపక్ష నాయకులతో పాటు ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులతో సమావేశమైన ఆయన సోమవారం జరుగుతున్న శాసన మండలి ఎన్నికలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు పట్టభద్రులను మోసం చేసిన వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిఎం జగన్మోహన్ రెడ్డి జోక్యం చేసుకొని అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కనీస విద్యార్హత లేనిరిక్షా కార్మికులను, తాపీ మేస్త్రీలను ఓటరు జాబితాలో చేర్చి దొంగ ఓట్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దొంగ ఓట్లతో పాటు ఓట్లను కొనుకుంటున్నారంటే ఎంతగా దిగజారుతున్నారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. పట్టభద్రులను, ఉపాధ్యాయులను అధికారులతో బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆఖరికి అభ్యర్థులు మారువేషాల్లో కలెక్టర్ ఆఫీసు గోడలు దూకి నామినేషన్ వేసే పరిస్థితికి దిగజార్చడం సిగ్గుచేటన్నారు. దొంగ ఓటు వేయడానికి ప్రయత్నస్తే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పిడిఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థులు ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజులకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని, ద్వితీయ ప్రాధాన్యత ఓటును టిడిపి బలపరుస్తున్న అభ్యర్థులకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, సిపిఐ పట్టణ కార్యదరి వినోద్ కుమార్, ఎస్‌టియు రాష్ట్ర నాయకుడు తిప్పన్న, సిపిఐ తాలూకా సహాయ కార్యదర్శి శివప్ప, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బిల్లుకుల్లాయప్ప, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అడ్డదారులు తొక్కుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టుభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వయంగా సిఎం దిగి వైసిపి అభ్యర్థులు గెలిచేందుకు దొంగ ఓట్లు ఎక్కించారని ఆరోపించారు. ఓటుకు డబ్బులు పంపిణీ జరిగిందని విమర్శించారు. ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించేందుకు తెలుగుదేశం పార్టీతో కలిసి పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు, అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు,టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి కి రెండవ ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు బి.కె. పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని విమర్శించారు. మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టుభద్రులు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి కి తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాల పేరుతో జాబ్ క్యాలెండరు అని మోసం చేశారని విమర్శించారు. మోసపూరిత ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పేందుకు మేధావులు, విద్యావంతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్

గాండ్లపెంట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం జరుగునున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద వంద మీటర్ల దూరం వరకు గుంపులుగా ఉండకూడదని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కదిరి కుంకుమ, దవనం ప్రత్యేకత

కదిరి అర్బన్ : ఎక్కడ ఎన్నడూ ఎప్పుడు ఏ ప్రదేశాలలో లేని దవనం కేవలం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో మాత్రమే కనిపిస్తుంది. కదిరి మల్లెలు అంటే ప్రతి ఒక్కరు ఇష్టపడతారు. బ్రహ్మ రథోత్సవం కదిలినప్పుడు భక్తులు దవనం మిరియాలు చల్లడం అనవాయితీ. ఇక కదిరి కుంకుమ అంటే రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాల వారు కూడా చాలా పవిత్రమైనదిగా భావిస్తారు. నరసింహస్వామి ఆలయాన్ని దర్శించిన ప్రతి ఒక్క భక్తుడు కదిరి కుంకుమను తీసుకుంటారు. బ్రహ్మోత్సవాలలో కూడా భారీ ఎత్తున కుంకుమ అమ్మకాలు జరుగుతాయి.

ఉచిత షుగర్ పరీక్షలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్లో స్పందన ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది శ్రీలత, దేవకి, తేజ, దిల్దార్ 120 మందికి షుగర్ పరీక్షలు చేశారు. షుగర్ నిర్ధారణ అయిన వారికి వారు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్ : సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లోకంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ మొబైల్ నెంబర్ 9154968576కు ఫోన్ చేయాలని ఓటర్లను కోరారు. ఏ సమస్య ఎదురైనా కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌ను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నదన్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్నికల సామాగ్రి అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ద్వారా చేరవేశామని చెప్పారు.

ఎర్రగుంటలో ఉచిత వైద్య శిబిరం

పరిగి : మండలంలోని ఎర్రగుంట ప్రైమరీ పాఠశాలలో ముబారక్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా, శ్రీనివాస స్కిన్ డెంటల్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించడమే కాకుండా అందుకు తగిన మందులను అందజేశారు. సుమారు 150 మంది పలు వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయించుకున్నారు. వేల రూపాయల ఖర్చుతో కూడుకున్న ఈ పరీక్షలను ఉచితంగా అందించడం ఎంతో ఉపయోగపడిందని గ్రామస్తులు అన్నారు. అంతేకాకుండా దంత పరీక్షలు కంటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక సర్పంచి బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఎంపీపీ భర్త ప్రభాకర్, సర్పంచులు మంజునాథ్ రెడ్డి, దిలీప్ కుమార్, కన్వీనర్ నరసింహమూర్తి పరీక్షలు చేయించుకున్నారు. గుండె సంబంధిత వైద్యులు డాక్టర్ నాగరాజు డాక్టర్ ఇమ్రాన్ ఖాన్ షాహిద్ ట్రస్ట్ సభ్యులు చంద్రశేఖర్ పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హాల్ టికెట్లు ఇవ్వని కాలేజీలపై చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకపోతే సంబంధిత కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజులు కట్టలేదన్న నెపంతో ఇంటర్మీడియట్ విద్యార్థికి హాల్ టికెట్ ఇవ్వటానికి నిరాకరించినట్లు ఫిర్యాదు అందినా, ఆ విద్యార్తి విద్యా సంవత్సరం కోల్పోయినట్లు గుర్తించినా సంబంధిత కళాశాల గుర్తింపును 2023-24 విద్యా సంవత్సరం నుండి రద్దు చేసేందుకు సిఫారసులు చేయనున్నామని చెపాపరు. పరీక్షలు దగ్గరపడుతున్నా చివరి నిముషం వరకు విద్యార్థులను ఫీజుల పేరిట మానసికంగా వేధిస్తున్నట్టు విద్యార్థులు,వారి తల్లిదండ్రుల నుండి తమకు అందుతున్న ఫిర్యాదులను పరిశీలనలోకి తీసుకొని ఆయా యాజమాన్యాలపై అవసరమనుకుంటే క్రిమినల్ చర్యలకు కమిషన్ తరపున సిఫారసు చేయనున్నామని అన్నారు. అలాగే పరీక్షలు జరిగే ప్రతీ కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు, దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు లేమిపై విద్యార్థులు,వారి తల్లిదండ్రుల నుండి అందే ప్రతి ఫిర్యాదును యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్ఐఒలను కోరుతున్నామన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన టోల్ ఫ్రీ నెంబర్ 1800 4257635 తో పాటు apscpcr 2018@ gmail.com కు ఫిర్యాదులు అందిస్తే చర్యలు చేపట్టేందుకు కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు సారథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సిద్ధంగా ఉందని సీతారాం చెప్పారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం




పోలింగ్‌కేంద్రాలను పరిశీలిస్తున్న హిందూపురం మున్సిపల్ కమిషనర్, జిల్లా ఎస్పీ

కదిరి టౌన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలు సోమవారం జరుగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలి ఎన్నికలకు సంబంధించి ప్రధానంగా పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థులు వైసీపీ టిడిపి మధ్య హోరాహోరీ పోరు కొనసాగనుంది. మండలి ఎన్నికలకు సంబంధించి ప్రధానంగా కదిరి డివిజన్‌లో మొత్తం 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో ప్రతి మండల కేంద్రానికి రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్ట భద్రులకు సంబంధించి 10 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టభద్రుల కొరకు కదిరి పట్టణంలో ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కదిరి డివిజన్ మొత్తంగా పట్టభద్రుల ఓటర్లు 7847 మంది ఉన్నారు. అందులో 5351 మంది పురుషులు, 2495 మంది మహిళలు ఉన్నారు. ఉపాధ్యాయులు ఓటర్లు డివిజన్ మొత్తం 726 ఉండగా పురుషులు 513, మహిళ ఉపాధ్యాయులు 213 మంది ఉన్నారు. వీరందరూ ఆయా పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

హిందూపురం : సోమవారం నేడు జరగనున్న శాసన మండలి ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ సౌజన్య లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టుభద్రుల కోసం 6, ఉపాధ్యాయుల కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పురపాలక సంఘ వ్యాప్తంగా పట్టుభద్రుల నియోజక వర్గం నుంచి పురుషులు 2719, మహిళలు 1665 మొత్తం 4384 ఓటర్లు ఉన్నారు. వీరి కోసం ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రంలో పురుషులు 434, మహిళలు 328 మొత్తం 762 ఓట్లు ఉన్నాయి. వీరి కోసం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి ఎంఇ నీరజ, ఎఇలు సురేష్, నాగేంద్ర, మున్సిపల్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు ఉపాధ్యాయ స్థానాలకు సోమవారం ఎన్నికలు జరుగుతున్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహశీల్దార్ రామాంజనేయ రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో రెండు గ్రాడ్యుయేట్లకు ఒకటి ఉపాధ్యాయులకు ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా పట్టభద్రులు 1715 మంది ఉపాధ్యాయులు 120 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. ఉదయం 8 నుండి సాయంకాలం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా 144 సెక్షన్ విధించినట్టు ఆయన తెలిపారు.

చిలమత్తూరు : సోమవారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వ సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం సాయంకాలమే ఎన్నికల అధికారులు సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండల వ్యాప్తంగా 782 మంది పట్టు భద్రుల ఓటర్లు, 32 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ రామ్ కుమార్, ఎస్ఐ శ్రీనివాసులు పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించారు.

కనగాన పల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మండల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రాలను ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల గురించి కనగానపల్లి ఎస్ఐ హనుమంతరెడ్డితో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రథోత్సవానికి భారీ బందోబస్తు

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించే రథోత్సవానికి భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ తెలిపారు. బ్రహ్మ రథోత్సవానికి చూసేందుకు అధికసంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో ప్రముఖులకు పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బందోబస్తులో భాగంగా ముగ్గురు డీఎస్పీలు,10 మంది సిఐలు, 15 మంది ఎస్ఐలు, 210 మంది సివిల్ పోలీసులు, 90మంది ఏఆర్ పోలీసులు, వంద మంది హోంగార్డులు, 26 మంది ఇతరులను కేటాయించినట్లు తెలిపారు. బ్రహ్మ రథోత్సవానికి హాజరవుతున్న భక్తులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని తుమ్మల కుంట గ్రామంలో విద్యుత్ స్తంభం అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది. గ్రామ సమీపంలోని పొలాల్లో ఉన్న ఈ విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయో అన్న విధంగా ఉన్నాయి. స్తంభానికి ఉన్న సిమెంట్ పోయి ఇనుప కడ్డీలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఈ స్తంభం ఏ సమయంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉంది. గ్రామసులు పొలాల్లోకి వెల్లాలంటే ఆ విద్యుత్ తీగల కిందనే వెళ్లాలి. జిల్లాలో అనేక చోట్ల విద్యుత్ తీగలు తెగిపడి రైతు కూలీల ప్రాణాలు పోతున్నా విద్యుత్ శాఖ అధికారులు మాత్రం మొద్దు నిద్రను వీడటం లేదు. సమస్యను అనేక సార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించామని అయితే అధికారులు పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే ఆ విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


స్తంభానికి సిమెంట్ పోయి కడ్డీలు కన్పిస్తున్న దృశ్యం

మెనూ పాటించని హాస్టల్ వార్డెన్లపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి అమరాపురం

మండల కేంద్రంలోని వసతి గృహాలోల మెనూ పాటించడం లేదని అధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిలాల ఉపాధ్యక్షులు ఈరేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వార్డన్లు నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించడం లేదని విమర్శించారు. ఎస్‌సి హాస్టల్‌లోని విద్యార్థులను జైలు లో బందించినట్టు వారిని లోపల ఉంచి గేటుకు తాళం వేసుకొని వెళ్లి పోవడం దారుణమన్నారు. వర్కర్స్ ఎవరూ లేకపోవ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వస్తే వారు ఎలా బయటికి వెళతారని ప్రశ్నించారు. వసతిగృహాల్లో ఉండే విద్యార్థులంటే ఇంత నిర్లక్ష్యమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వసతిగృహాలను తనిఖీ చేసి సంబంధిత వార్డన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచచరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు తిప్పేస్వామి, హేమంత్, సిఐటియు మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

రహదారి మళ్లింపు

కదిరి టౌన్ : మండలి ఎన్నికలతో పాటు సోమవారం . శ్రీ లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం జరుగుతున్న నేపథ్యంలో రహదారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. కదిరి రూరల్ మండలంలోని ముత్యాల చెరువు, కొండమ నాయుని పాళ్యం తదితర గ్రామాలకు సంబంధించిన ఓటర్లు ఓటింగ్ కేంద్రానికి రావాల్సి ఉండడంతో హిందూపూర్ రోడ్డు గుండా పోలింగ్ కేంద్రాలకు చేరుకునుటకు ఇబ్బంది దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ మార్గాలుగా మూర్తి పల్లి సమీపంలోని స్మశాన వాటిక పక్కగా మారుతి నగర్ గుండా పోవు దారిని లేక నూతనంగా నిర్మించ బడుతున్న బై - పాస్ రోడ్డు ను ఉపయోగించి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని డీఎస్పీ కోరారు. అలాగే ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామీ రథోత్సవం సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఉండేందుకు బెంగళూర్ నుండి పులివెందుల కి వెళ్ళ వలసిన వాహనాలు ఓడిసి మీదుగా దారి మళ్లించినట్లు చెప్పారు. అలాగే కదిరి నుండి బెంగళూర్ కి వెళ్ళ వలసిన వాహనాలు కుటాగుళ్ళ, మొలక వేమల క్రాస్ మీదుగా మళ్లించినట్లు తెలిపారు. అలాగే తాత్కాలికంగా ఆచార్య నాగార్జున అగ్రి కల్చర్ దగ్గర బస్‌లు ఉంటాయని ప్రజలు గమనించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని జరికుంటపల్లి డాబాల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేమారెడ్డి పల్లెలో నివాసముంటున్న ఆర్మీ జవాన్ సోమశేఖర్ రెడ్డి (39) మృతి చెందాడు. ఎస్ఐ గోపీ తెలిపిన వివరాలు.... తనకల్లు మండలం మండ్లపల్లికి చెందిన సోమశేఖర్ రెడ్డి ఇటీవల వేమారెడ్డి పల్లి లో ఓ ఇంటిని కొనుగోలు చేసి అక్కడే కాపురం ఉంటున్నాడు. ఇతను బెంగళూరులో ఆర్మీలో పనిచేస్తూ సెలవుపై శనివారం రాత్రి ఇంటికి వచ్చాడు. సొంత పని నిమిత్తం ఆదివారం వేమారెడ్డిపల్లి నుండి ద్విచక్ర వాహనంలో ఓడిసికు వెళ్తుండగా గోరంట్లవైపు వెళుతున్న ఆటో అతని వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్మీ జవాన్ సోమశేఖర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపీ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మృతునికి భార్య స్వర్ణలత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమశేఖర్‌రెడ్డి ఇంకో ఏడాదికి ఉద్యోగ విరమణ కావాల్సి ఉందని మృతుని బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాపుత చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.


సోమశేఖర్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

ఘర్షణ... పలువురికి గాయాలు

రొద్దం : మండలంలోని కలిపి మరువపల్లి గ్రామంలో పాతకక్షలతో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ నెలకొంది. శనివారం రాత్రి గ్రామంలో నిర్వహించిన రికార్డ్ డాన్స్ ప్రోగ్రాంలో జరిగిన చిన్నపాటి ఘర్షణ ఆదివారం దాడులు దారి తీసింది. గ్రామంలో ఆరు నెలల క్రితం ఒకే సామాజిక వర్గానికి చెందిన ప్రేమ వ్యవహారంతో ఈ సంఘటన నెలకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. రఘురామప్ప వర్గానికి చెందినవారు, శివప్ప వర్గానికి చెందినవారు చిన్న చిన్న ఘర్షణను పెద్దగా చేసుకుని ఒకరిపై ఒకరు కట్టెలు, రాళ్లతో దాడులు చేసుకున్నట్లు చెప్పారు. రెండు గ్రూపులకు చెందిన వారు తీవ్రగాయాల పాలవడంతో కొంతమంది హిందూపురం, మరి కొంతమందిని పెనుగొండ ఆసుపత్రులకు తరలించారు. మరి కొంతమంది పోలీస్ స్టేషన్ చేరుకొని ఫిర్యాదులు చేసుకున్నారు. రెండు గ్రూపుల వారిని విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

రొద్దం : మండలంలోని ఆర్ఎల్.కొత్తూరు గ్రామ సమీపంలో కంప చెట్ల వద్ద పేకాట ఆడుతున్న స్థావరం పై పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్టు చేశారు. పేకాట ఆడిస్తున్న పేకాట ఆర్గనైజర్ మారుతి తో పాటు మొత్తం 10 మంది పేకాట జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. వారి వద్ద నుండి రూ.58,140 నగదు, 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జమేదార్ కాంతప్ప, పోలీసులు పోతన్న, హనుమంతరాయిడు,అనిల్ రెడ్డి,శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


జూదరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పోలీస్ స్టేషన్ ముందే ఘర్షణ

పరిగి : స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద బీచిగానిపల్లి సర్పంచి బాలాజీ, మరో వైసీపీ నాయకుడు ప్రభాకర్‌కు చెందిన గ్రూపులు ఘర్షణకు దిగిన సంఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. అందుకు సంబంధించిన వివరాలు... బీచిగానిపల్లి సర్పంచి బాలాజీ స్థానిక వైసీపీ నాయకులతో విభేదాలు ఉండటంతో ఓ ప్రత్యేక గ్రూపును ఏర్పరచుకుని పార్టీలో పనిచేస్తున్నాడు. ఈయన పెనుగొండ నియోజకవర్గంలో ఒక వర్గానికి మద్దతుగా వ్యవహరిస్తున్నాడు. ఈ కారణం వల్ల ఇటీవల గడపగడప కార్యక్రమాన్ని కూడా సర్పంచి లేకుండానే నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచాయతీ ఇన్చార్జిగా ఉన్న ప్రభాకర్ పార్టీకి మద్దతుగా ఓటు అభ్యర్థించడంలో శనివారం రాత్రి గ్రామంలో గొడవ జరిగింది రెండు వర్గాలు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాయి. అయితే ఈ గొడవలో సూత్రధారిగా సర్పంచి బాలాజీ ఉన్నారని స్టేషనుకు పిలిపించిన ఎస్ఐ విచారించి పంపారు. అనంతరం రెండు వర్గాలు బయటకు వెళుతున్న నేపథ్యంలో ఒకరికొకరు స్టేషన్ వద్ద దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో సర్పంచి బాలాజీ తో పాటు నరసయ్య, శివయ్య తదితరులు గాయపడ్డారు. ఈ ఘర్షణను సీరియస్‌గా తీసుకున్న సిఐ కరుణాకర్ సాయంత్రం గ్రామంలోకి వెళ్లి రెండు గ్రూపులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణ వాతావరణం నెలకొల్పిన శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


గోరంట్లలో పార్టీ ఆవిర్భావ వేడకల్లో వైసిపి నాయకులు

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

గోరంట్ల : పట్టణంలో వైసిపి కార్యాలయంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసప్ప యాదవ్, టౌన్ కన్వీనర్ ధనారెడ్డి, సర్పంచులు సరోజ నాగే నాయక్, రామాంజనేయులు, గంగప్ప, ఆది, రాజారెడ్డి, చింతా రామచంద్రారెడ్డి, రంగారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : బడుగు బలహీన వర్గాల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నామినేటెడ్ పదవుల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించి బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన ఏకైక సీఎం జగన్ అని చెప్పడానికి గర్వంగా ఉందని నాయకులు అన్నారు. రాజకీయంగా అన్ని వర్గాలకు సాధికారత తీసుకొచ్చారు. మహిళలకు నిజమైన సాధికారత దిశగా జగన్ ప్రభుత్వం అడుగులు వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు లోకేష్ వాల్మీకి, మండల నాయకులు బసిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, మార్కెట్ చాంద్‌బాషా, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటీసీలు, కో ఆప్షన్ మెంబర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో కుమ్మరవాండ్లపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు బహుద్దిన్, నాయకులు ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచి బత్తల వెంకటరమణతో పాటు నాయకులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న కదిరి నాయకులు